# కోడలూ ఒకింటి ఆడపిల్లే!

**కె.వి.సుమలత**




అపూర్వ పెళ్లి ఇంకా వారం రోజులు ఉందనగా అమెరికా నుండి ఆనంద్, ప్రవల్లిక వచ్చారు. ఇల్లంతా పెళ్లి కళతో కళకళలాడుతోంది. అన్నయ్య వదినలకు ఎదురొచ్చిన అపూర్వ ప్రవల్లికను ఆనందంతో చుట్టేసింది.

''ముందు వచ్చిన చెవులకన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి అంటే ఇదే కాబోలు'' ఆనంద్ చమత్కారంగా అన్నాడు.

''అది కాదన్నయ్యా'' అంటూ దగ్గరకు వచ్చిన ప్రవల్లికను దగ్గరకు తీసుకుని నవ్వేశాడు ఆనంద్.

''సరిసరి... ఇక లోపలకు రండి'' అంటూ దమయంతి కొడుకు కోడళ్లను ఆహ్వానించింది.

''ఏమిట్రా నాన్నా! చిక్కి సగమయ్యావు? భోజనం సదుపాయంగా ఉండడం లేదా?'' అపూర్వ వైపు చూస్తూ 'ఆనంద్‌ని దగ్గరకు తీసుకుంటూ అందావిడ.

''చిక్కడమా పాడా? అన్నయ్య ఇక్కడి నుండి వెళ్లాక నునుపు తేలి చక్కగా ఉన్నాడు. ఇదంతా మా వదిన చేతి వంట మహత్యం'' అంటూ అపూర్వ ప్రవల్లికతో ''ఇక ఫ్రెష్ అవుదురుగానీ పదండి'' అంటూ మాట మార్చేసింది.

దమయంతిదంతా అల్ట్రామోడరన్ సూర్యాకాంతం టైపు. కోడలితో మంచిగా మాట్లాడితే అత్తగారి హోదాకు భంగం వాటిల్లుతుందని ప్రగాఢంగా నమ్మకం గలది. అడుగడుగున సూటిపోటి మాటలంటూ ఆమడ దూరంలో ఉంచితే తనంటే భయభక్తులు ఉంటాయనుకుంటుంది. చదువుకుని ఉద్యోగం చేస్తున్నాను అనే అహంకారంతో తనెక్కడ తక్కువ చేస్తుందోనని ఎప్పుడూ ఏదో రకంగా నిష్ఠూరాలాడుతుంది. ఆవిడ దురదృష్టమో ప్రవల్లిక అదృష్టమో పెళ్లయిన కొంత సమయానికే నవదంపతులు అమెరికా వెళ్లిపోయారు.

అలా ప్రత్యక్షంగా కోడలిని బాధించే ఛాన్సు ఆవిడ మిస్సయింది. అయినా అపుడపుడూ ఫోనులో ఏదో రకమైన వేధింపు మాట్లాడి తృప్తి పడుతుంటుంది.

తల్లి మనస్తత్వం తెలిసిన ఆనంద్ ప్రవల్లికకు సర్దిచెప్తుంటాడు. అత్తగారి మాటలు, చేష్టలు ప్రవల్లికకు అస్సలు నచ్చవు. ఆనంద్ మంచితనం గుర్తించి అతని కోసం మౌనం వహిస్తుంది. ఆ కుటుంబంలో ఆవిడ తప్ప అంతా మంచివాళ్లే. మామయ్యగారు మోహన్రావ్ భార్య నోటికి దడిసినా కోడలంటే చాలా ఆప్యాయంగా ఉంటారు. ఇక అపూర్వ విషయానికి వస్తే ఉన్నది ఉన్నట్లు సూటిగా మాట్లాడే విలక్షణమైన వ్యక్తి. తప్పు చేస్తే తల్లయినా ఎత్తిచూపి పరిస్థితిని చక్కదిద్దుతుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తుంది. ఎవరితోనయినా ఇట్టే కలిసిపోయే మనస్సు కలిగిన మంచి అమ్మాయి. అందుకే అపూర్వ అంటే ప్రవల్లికకు చాలా ఇష్టం. తనలో లేని ధైర్యం అపూర్వలో చూస్తుంటే ప్రవల్లికకు ముచ్చటగా ఉంటుంది. అందువల్ల ఇద్దరూ మంచి ఫ్రెండ్సయ్యారు.

అపూర్వ పెళ్లి చేసుకోబోయే సునీల్ కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. ఆస్తిలో అంతస్తులో వీళ్ల కన్నా ఒక మెట్టు ఎక్కువలోనే ఉన్నారు వాళ్లు. అమ్మాయి నచ్చిందని కానీ కట్నం తీసుకోకుండా వివాహానికి ఒప్పుకున్నారు. దమయంతి ఆనందానికి అవధులు లేవు. ఇదంతా కూతురి అదృష్టం అని మురిసిపోయింది. వాళ్లు పై స్థాయి వాళ్లని ఆడంబరంగా పెళ్లి ఏర్పాట్లు చేస్తుంది. తమ ఏర్పాట్లు చూసి అవతలి వారు మనకు ఏమాత్రం తీసిపోని కుటుంబం అనుకోవాలని ఆవిడ అభిప్రాయం.

పెళ్లి రోజు వచ్చేసింది. బంధుమిత్రులతో కళ్యాణమండపం నిండిపోయింది.

పెళ్లికూతురు అలంకరణతో అపూర్వ మెరిసిపోతోంది. ప్రవల్లిక, దమయంతి అతిథులను ఆహ్వానించడంలో లీనమయ్యారు. సంప్రదాయం ప్రకారం ఆనంద్ బావగారిని తీసుకురావడానికి విడిది గృహానికి వెళ్లాడు.

ఎదురుకోళ్ల ఏర్పాట్లకు అంతా సంసిద్ధులవుతున్నారు. అంతలో ఆనంద్ నుండి వచ్చిన ఫోన్‌కి అంతా నిశ్చేష్టులయ్యారు. పెళ్లిసందడిలో కళకళలాడుతున్న మండపం పిడుగు పడ్డట్లుగా నిర్జీవమైంది.

పెళ్లికూతురు రూములో ఉన్న అపూర్వ బయటకు వచ్చి ''ఏం జరిగిందని'' తండ్రిని ప్రశ్నించింది.

''పెళ్లికొడుకు తల్లి దీపారాధన కుందులతో విడిదిలో నుండి బయల్దేరి కారు ఎక్కుతుండగా కుందులు చీరకు అంటుకుని గాయాలయ్యాయట. పట్టుచీర కావడంతో వెంటనే భగ్గుమని ఒళ్లు అంటుకుందట. వెంటనే ఆర్పడానికి సరైన గుడ్డ అందుబాటులో లేకపోవడం వల్ల ఆవిడకు నలభై శాతం ఒళ్లు కాలిందట. అంతా ఆవిడను హాస్పిటల్‌కు తీసుకువెళ్లారని, అక్కడే ఉన్నారని ఆనంద్ చెప్పాడు'' అన్నారు మోహనరావుగారు. వింటున్న అపూర్వ అవాక్కయింది.

చుట్టూ ఉన్న బంధువులంతా తలా ఒక మాట అంటున్నారు. ''దీపారాధన కుందులు అంటుకోవడం మామూలు విషయమా? అశుభం కదూ! వాళ్లు పెళ్లికి అంగీకరిస్తారో లేదో''

''ఇంకేం పెళ్లిలే. తల్లికి అంత ఘోరం జరిగితే పెళ్లికొస్తారా?''

''శుభమా అని పెళ్లి చేసుకుందామని వస్తే ఆ అబ్బాయి తల్లికి ఒళ్లు కాలడం ఎంత అనర్థం?''

రకరకాల చర్చలతో మండపం మారుమోగుతోంది.

దమయంతి ముఖంలో కత్తివేటుకి నెత్తురు చుక్క లేదు. స్తంభానికి ఆనుకుని నేల మీద కూలబడిపోయింది. ప్రవల్లిక అత్తగారికి చేరువలో కూర్చుని ఆవిడను ఓదారుస్తోంది.

దమయంతి కళ్ల నుండి నీళ్లు కారిపోతున్నాయి. ఆవిడ జ్ఞాపకాలు రెండు సంవత్సరాల వెనక్కు వెళ్లాయి.

ఆనంద్ పెళ్లిలో ఎదురుకోలు వేడుక జరుగుతుంది. అంతా సరదా సరదాగా ఉండి. వరుస అయిన వాళ్లు హాస్యోక్తులతో నవ్వులజల్లు కురిపిస్తున్నారు. కానీ దమయంతి ముఖం మాత్రం ముటముటలాడిస్తూనే ఉంది. దేనికోదానికి రుసరుసలాడుతూనే ఉంది.


ముహూర్తం రాత్రి పదింపావుకి. ఇంకా రెండు


గంటల సమయముంది. అంతా భోజనాలకు కూర్చున్నారు. భోజనం ఏర్పాట్లు చక్కగా చేశారు. ప్రతి ఒక్కరికీ పదార్థాలు అన్నీ బాగా నచ్చాయి. దమయంతి వియ్యంకుడిని పిలిపించి ''ఇవేం వంటలు. ఇవేం ఏర్పాట్లు? కనీసం మా కుటుంబానికయినా వెండి పళ్లాల్లో భోజనం పెట్టచ్చుగా!'' అంటూ విసుక్కుంది. పాపం! ప్రవల్లిక తండ్రి చిన్నబుచ్చుకుని మారు మాట్లాడలేదు.

అది చూసి అక్కడున్న బంధువులంతా తలో మాట మాట్లాడుకున్నారు. పెళ్లికొడుకు తల్లికి పెళ్లి ఇష్టం లేదేమో అని చెవులు కొరుక్కున్నారు. ప్రవల్లిక కుటుంబం అవమాన భారంతో తలదించుకున్నారు.

పురోహితుడు ప్రవల్లికతో గౌరీపూజ చేయిస్తుండగా మండపంలో కలవరం మొదలైంది.

అదేమిటంటే దమయంతి మెట్లు ఎక్కుతుంటే కాలు జారి మెట్ల మీద బోర్లా పడింది. ముక్కుకి మూతికి బలంగా తగిలి పగిలి రక్తం వస్తుంది. ఆవిడ రక్తం చూసి బెదిరిపోయి పెద్దగా ఏడుస్తోంది.





ఆవిడను పట్టుకొచ్చి మంచం మీద కూర్చోబెట్టి రక్తం తుడిచి డాక్టర్‌ను పిలిపించారు. కాలు నడవనివ్వడం లేదని దమయంతి విలవిలలాడుతుంది. డాక్టర్ డెట్టాల్‌తో గాయాలు శుభ్రం చేసి చికిత్స ఆరంభించారు. కాలు ముట్టుకోనివ్వకపోవడం చూసి మోకాలు వద్ద విరిగినట్లుంది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి అని డాక్టర్ గారన్నారు. అది విని ఆవిడ మరింత పెద్దగా ఏడుపు లంకించుకుంది.

''పెళ్లి జాతకం మంచిది కాదు. మాకు ఈ అమ్మాయి వద్దు బాబోయ్.!... ఈ పెళ్లి ఆపేద్దాం'' అని అరుస్తూ చెప్పింది దమయంతి.

ఆ దూకుడుకి ప్రవల్లిక అమ్మ, నాన్నలు స్థాణువులయ్యారు. వెంటనే తేరుకొని ఆవిడను ప్రసన్నం చేసుకోవడం మొదలుపెట్టారు. ''కాస్త పెద్ద మనసు చేసుకోండమ్మా! జరిగినదాంట్లో మా అమ్మాయి తప్పు ఏముందమ్మా. కాస్త ఓపిక పట్టండమ్మా. పెళ్లయిపోతుంది'' అని కాళ్లా వేళ్లా పడ్డారు.

''నేను నిముషం కూడా కూర్చోలేను. బిడ్డ వచ్చిన వేళ గొడ్డు వచ్చిన వేళ అంటారు. మీ అమ్మాయి మా ఇంటికి రాకముందే నా రక్తం కళ్లజూసింది'' అని రెచ్చిపోయింది దమయంతి.

ఆనంద్, మోహన్రావ్, అపూర్వ ఆవిడకు నచ్చజెప్ప ప్రయత్నించినా ఆవిడ వినలేదు.

''మరో ముహూర్తం చూసి పెళ్లి చేద్దాం. ఇప్పుడు మాత్రం వద్దు'' అని మాట తిప్పేసింది ఆఖరుకి.

మండపంలో కన్నీళ్లతో కూర్చున్న ప్రవల్లికను చూసి అపూర్వ తల్లితో ''నువ్వు ఆస్పత్రిలో జాయిన్ అవ్వాలి కదా. పద వెళ్దాం. అన్నయ్య ఇక్కడే ఉంటాడు. పెళ్లి ఆపవలసిన అవసరం లేదు. నువ్వు కాలుజారి పడడానికి, ఆ అమ్మాయి జాతకానికి సంబంధం ఏమిటి? అనవసరంగా అల్లరి చేయవద్దమ్మా'' అని గట్టిగా చెప్పింది.

తన మనసులో మాట అపూర్వ చెప్పడంతో ఆనంద్ దమయంతికి మాట్లాడే ఛాన్సు ఇవ్వకుండానే కళ్యాణ మండపం ఎక్కి పెళ్లి పీటల మీద కూర్చున్నాడు.

ప్రవల్లిక కృతజ్ఞతా పూర్వ

కంగా అపూర్వ వైపు చూసింది. ఆమె కుటుంబం మాత్రమేకాక అక్కడున్న అందరూ అపూర్వను ప్రశంసించారు. అంబులెన్స్ రావడంతో దమయంతిని ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

గతం తాలూకు జ్ఞాపకాల నుండి తేరుకున్న దమయంతి పశ్చాత్తాపం నిండిన మనసుతో కళ్లనిండా నీటితో ప్రవల్లిక చేయి పట్టుకుంది. నిజానికి ప్రవల్లిక, అపూర్వలకు కూడా జరిగినవి కళ్ల ముందు మెదిలాయి. చచ్చిన పాములాగా ఉన్న ఆవిడ వంక జాలిగా చూసి మౌనం వహించారు.




అప్పుడే అక్కడికి బిలబిలమంటూ పెళ్లికొడుకు తరపు జనం ఆసుపత్రికి వెళ్లినవారు తిరిగివచ్చారు. ఆనంద్ పెళ్లికొడుకుని అతని కుటుంబాన్ని తీసుకొని వచ్చాడు. సునీల్ తల్లి మినహాయించి అంతా అక్కడికి వచ్చారు. సునీల్‌ని పందిట్లో కూర్చోబెట్టి ఆనంద్ తల్లి దగ్గరకు వచ్చాడు.

అక్కడి పరిస్థితి చూసి ఆనంద్ అంతా అర్థం చేసుకుని ''ఎవరూ కంగారు పడవద్దు. నిజంగా సునీల్ వాళ్ల అమ్మగారు దేవత. ఆవిడ స్పృహలోకి వచ్చిన నుండి ఒకటే గొడవ. ఎట్టి పరిస్థితులలో పెళ్లి ఆగకూడదు. ఆడపిల్ల మాట పడకూడదు. వెళ్లి పెళ్లిపనులు చూడండి. పెళ్లికూతురు తరపు వాళ్లు ఎంత కంగారు పడుతున్నారో వెళ్లండి'' అంటూ అందరినీ ఇక్కడకు పంపింది అన్నాడు.

ఆవిడ మంచి మనసుకి అందరూ మనసులోనే జోహార్లర్పించుకుని పెళ్లి పనులలో లీనమయ్యారు. మంగళవాయిద్యాలు మోగాయి. పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోయింది. సునీల్ అన్నయ్య వదిన సునీల్ పక్కన పీటల మీద కూర్చున్నారు. అనుకున్నట్లుగానే జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా దమయంతి పెళ్లి జరిగినంతసేపు కన్నీరు కారుస్తూనే ఉంది.


పెళ్లి తంతు పూర్తయ్యేసరికి రాత్రి పన్నెండున్నర అయింది. అపూర్వ కోరిక ప్రకారం అంతా ఆసుపత్రికి వెళ్లారు. వధూవరులిద్దరూ మంచం మీద ఉన్న ఆవిడ కాళ్లకు నమస్కరించి ఆశీస్సులు పొందారు.

దమయంతి వియ్యపురాలి చేతులు పట్టుకొని ''మీకు ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదండీ వదినగారూ! మీ ఋణం తీర్చుకోలేనిది మా అమ్మాయి మీద మచ్చ పడకుండా కాపాడారు. అంతేకాదు మీ వల్ల నేను చాలా నేర్చుకున్నాను'' అంటూ దుఃఖపూర్వకమైన స్వరంతో అంది.

''అయ్యో! అలా అనవద్దు వదిన గారూ! పొరపాటు నా వల్ల జరిగితే వచ్చే కోడలి మీద అభాండం వేయడం ఎంతమటుకు సబబు? మనం కంటేనే ప్రేమ చూపించాలి అనుకుంటే తప్పు. మన ఇంటికి వచ్చే అమ్మాయి కూడా కన్న కూతురితో సమానమే! ఇందులో నేను చేసిందేమీ లేదు'' నీరసంగా అయినా స్పష్టంగా మాట్లాడింది సునీల్ తల్లి.

మంచితనం మూర్తీభవించిన ఆ మహోన్నతమైన వ్యక్తిని అక్కడున్న అంతా నీళ్లు నిండిన కళ్లతో అలా చూస్తుండిపోయారు.

☆



## తాప్సీ ఘనకార్యం

ప్రభాస్ హీరో, కాజల్-తాప్సీ హీరోయిన్లుగా దిల్ రాజు నిర్మిస్తున్న సినిమాకి 'మిస్టర్ పర్‌ఫెక్ట్' అనే టైటిల్ పెడుతున్నట్టుగా ఊహాగానాలు జోరుగా షికారు చేయడానికి కారకురాలు తాప్సీయేనట. తన ట్విట్టర్‌లో ఆ సినిమా పేరును ఆమె ప్రస్తావించడంతో టైటిల్ అలా పాపులర్ అవుతోంది. అయితే ఇంకా ఈ టైటిల్‌ని నిర్మాత రిజిస్టర్ చేయకపోవడమేకాదు వేరే వ్యక్తి పేరిట ఆ టైటిల్ వుందిట. టైటిల్ వ్యవహారం తలనొప్పిగా వున్న సమయంలో తాప్సీ ఇలా టైటిల్ గురించి రాయడం వల్ల ఆమె మీద దిల్ రాజుకి కోపం రావడం సహజమే! తాప్సీ మాత్రం అదేం పట్టించుకోకుండా ఎంచక్కా చెన్నయ్‌లో తమిళ సినిమా షూటింగ్‌లో బిజీగా వుందిట.